"పదవులు పెరిగేకొలదీ, సుఖాలు మరిగే కొలదీ పరువు పల్చబడిపోతుందా?"

# సుఖం

అనంతం

ఇంటికి రాగానే, వీధిగదిలో టేబుల్ మీద కాంపోజిషన్ లకట్ట పడవేసి, టేబుల్ క్రింద చెప్పులు విడిచేసి, పైకండువా పాగాక్ర మీదకు విసిరేసి, లుంగీకట్టుకొని, పంచె, చొక్కాకూడా పాగాక్రకు తగులుకొనేలా విసిరేసి, గబగబా నూతివద్దకు వెళ్ళి, కాళ్ళూ, చేతులూ, ముఖమూ కడుక్కొని, పడకకుర్చీ తీసికొని వీధిగది ముందు వాకిట్లో వేసుకొని, ప్లీడరుగారింటివైపు మొహంపెట్టి, కుర్చీలో చేర్లపడి, 'హుష్' అనుకొంటూ కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. కాళ్ళు బారజాపుకొని కామేశ్వరరావుగారు.

ఆ ఇలు దక్షిణ ముఖంగా ఉంటుంది. మూడు వాటాలు. పడమటివైపు మూడుగదుల వాటాలో తను ఉంటున్నాడు. మధ్యవాటాలోనూ, తూర్పువైపు వాటాలలోనూ ఇంటివాళ్ళు అంటే ఒక మొగుడూ, ఒక పెళ్ళామూ, ఇక పిల్లలుపుట్టే అవకాశంకూడా లేనివాళ్ళు ఉంటున్నారు.

ఇంటిని ఆనుకున్న వీధి ఉత్తర దక్షిణాలుగా ఉంటుంది. అంటే, పడమటివైపు వాటాలోవాళ్ళు వీధిలోకి వెళ్ళాలంటే, ఇంటివాళ్ళ వాకిట్లోంచి వెళ్ళాలి. ఇంటికి దక్షిణం వైపున ప్లీడరుగారి ఇల్లు వుంది. ఆ ప్లీడరుగారికి ఊళ్ళో మేడ వుంది. ఒకప్పుడు ఆయనకు ప్రాక్టీసు వుంది. ఇప్పుడక్కర లేనంత ఖాళీ వుంది. ఊళ్ళో ఎప్పుడూ లేనంత గొడవగా వుంది. ఆయన మనస్సు చిరాగ్గా వుంది. ఇది ఆ ఊరికి క్రొత్తగా పేట వెలుస్తున్న ప్రాంతం. ఇక్కడ ఎప్పుడో ఓడిపోయిన ఒక పార్టీ ఫీజు కోసంగాను గజం రూపాయి చేసి బతిమలాడి అప్పగించిన స్థలం కాళీగా వుంది. సిమ్మెంటు, ఇనుము కంట్రోలుధరకుకొనగలిగినకావలసినంత పలుకుబడి వుంది. కొత్తగా బ్యాంకులు వెలుసున్నాయేమో, ఊళ్ళో మేడకు ఊహించనంత అద్దె వచ్చే అవకాశం వుంది.

అందుకని ఇక్కడ డాబా లేచింది. దానికి ఇపుడు చుట్టూ ప్రహరీకి పునాదులు వేస్తున్నారు. అంటే పునాదులు లేచాయి.

మూడు నెలలనుంచి సాగుతోంది ఈ కట్టడం. అంటే రోజూ కడుతున్నారనీ కాదు. కడుతున్ననాడైనా అస్తమానూ కడుతున్నారనీ కాదు. మేస్త్రీ ఉన్నప్పుడు మెదుల్తూ, కామందుల వారున్నప్పుడు కదుల్తూ, తాపీలు తాపీగా తళతళలాడుతూ వుంటే, ఇల్లు మొదలెట్టిన మూడు నెలలకు పూర్తి అయింది ప్రహరి పదిహేను రోజులు పడుతుందేమో

ప్రశాంతంగావుండే ప్రదేశంలో అరుపులు, విరుపులు, టకటకలు, కసకసలు, పిసపిసలు, గరగరలు, బరబరలు, డమడమలు కామేశ్వరరావుగారి మెదడుమీదే రాస్తున్నట్టు, గీస్తున్నట్టు, కోస్తున్నట్టు, పాముతున్నట్టు వుండడంతో మొదట్లో మహా చికాగ్గా వుండేవి

అయితే, తనకు ప్రైవేటు కుర్రాళ్ళ బెడద లేదేమో, ప్రొద్దున్నా, సాయంకాలం వాకిట్లో వాలుకుర్చీ వేసుక్కూర్చునో, అరుగుమీద గోడకి జార్లబడి కూర్చొనో ఆ యిల్లు కటడం చూస్తూ వుంటే కాలక్షేపమై చూడనినాడు తోచని సితికి వచ్చేశాడు.

పనివాళ్ళ పలకరింపులు, విసుర్లు, కసుర్లు, బూకరింపులు చూస్తూ వుంటే ఇల్లు కట్టి చూడకుండానే ఎన్నో సంగతులు నేర్చుకొన్నాడు.


అంచేత అక్కడ కూర్చొని చూస్తూ వుంటే, ఆవేళ తప్ప ఎన్నడూ విసుగు అనిపించలేదు.

అందుకు కారణం ఆ ఇంటిలోనూ లేదు, దాన్ని కట్టడంలోనూ లేదు. దాన్ని చూడటంలోనూలేదు ఆవేళ హైస్కూల్లో జరిగిన ఒక చిన్న సంఘటనలో ఉంది.

అరగంట క్రితం హెడ్‌మాస్టరు పనిమాలా పిలిచి "ఏమండీ, ఏమిటి విశేషాలు?" అన్నాడు


"అబ్బే ఏమీ లేవండి" అన్నాడు తాను.

చెప్పవలసినదేదో చెప్పటం లేనన్నట్లుగా అనుమానంతో చూశాడు హెడ్‌మాస్టరు.



సంక్రాంతి ముగ్గు

—ఆలపర్తి రత్నకుమారి, నందివెలుగు




అయినా తను చేయగలిగినదేమీలేక ఊరుకొన్నాడు.

ఇక లాభం లేదనుకొన్నాడో. ఏ మో. "ఏమిటీ, నిన్న ఛైర్మన్‌ను కలుసుకొన్నట్లున్నారే?" అన్నాడు హెచ్.ఎమ్.

అదీ అన్నమాట అనుకొన్నాడు తను.

ఈయనగారు ఛైర్మన్ అయినప్పటి నుంచి తన ప్రాణంమీదకి వచ్చింది. తను అతనిచుట్టూ తిరగలేదు. భజన చేయలేదు. ఓట్లు వేయిస్తానని చెప్పలేదు. పోస్టల్ ఓట్లు పోగేసుకొని వెళ్ళి ఇవ్వ లేదు. అయినా ఆ ఛైర్మన్‌కి ఎందుకో తనంటే ఇష్టం ఏర్పడింది. ఏ ఊరైనా వెడుతూ వుంటే, ఏమీ తోచకపోతే, తనని వెంట పెట్టుకుపోతాడు. ఇంకెవరూ దొరకనట్టు. తను సెలవు పెట్టకుండా వెళ్ళడు. ఎప్పుడూ లేటుకాడు. తన పనిలో లోటు రానివ్వడు.

కాని ఈ హెచ్చెమ్ కెందుకో తన


కోట్లాది ప్రజలకు ప్రీతిపాత్రమైన అత్యంత విలువైన పుస్తకములు

1. టైలరింగ్ & కటింగ్ గైడ్ రు. 15/-
2. కోకశాస్త్ర (112 ఫోటోలు) " 15/-
3. 68 పడకగది ఫోటోలు " 15/-
4. ఫోటోగ్రఫీ " 15/-
5. కామసూత్ర " 15/-
6. ప్రైవేట్ ఫోటో ఆల్బమ్ " 30/-
7. డ్రాయింగ్ & పెయింటింగ్ " 15/-
8. దాంపత్య జీవితం " 15/-
9. రేడియో&ట్రాన్సిస్టర్ గైడ్ " 30/-

పోస్టేజి అదనం.

STAR BOOK DEPOT (AJW)
Chhapeti, Aligarh.


మీద మాత్సర్యం ఏర్పడింది. సవతిపోరు ప్రారంభమైంది. తనకు పితూరీలు చెప్పటం చేతకాదు. అలవాటూలేదు. అవసరమూ లేదు. కాని ఏదో చెపుతున్నాననీ, ఇద్దరు మనుషులు కలుసుకున్న తరువాత ఇతరులను గురించి చెడుగాక ఇంకేమి చెప్పుకొంటారనీ కిందవాడు అందరికంటే పై వాడ్ని కలుసుకొన్నప్పుడు తన పైవాడ్ని గురించో, వుంటే తనకంటే కిందవాడ్ని గురించో కొండేలు మనవి చేసుకోవటం తప్ప. మరింకేమి మాటాడతాడనీ, స్వానుభవమూ, పరానుభవమూ రక్త మాంసాలుగా పెరిగిన హెచ్చెమ్ తనపట్ల నిత్య శంకితుడు

నిన్న మామూలుగానే ఛైర్మన్ పిచ్చాపాటీ చెప్పిన తరువాత తన కారులో స్కూలు దగ్గర దింపి వెళ్ళిపోయాడు. కారు చప్పుడు విని గబగబా గుమ్మం దగ్గరికి కదులుతున్న రథంలా, గునగున గునుకు పరుగులోవచ్చి, రెండుచేతుల మధ్యకీ నెత్తి వచ్చేట్లుగా హెచ్చెమ్ నమస్కారం చేస్తున్నాడని గమనించని కారణంచేత, అందుకోకుండా వెళ్ళిపోయాడు ఛైర్మన్.

అదీ,యిదీ కూడా గమనిస్తున్నట్లు గమనింపబడకుండా వుండాలని ప్రయత్నిస్తూ, తాను గమనించినప్పుడే, రాగల వుత్పాతం గురించి మానసికంగా సన్నద్ధుడౌతున్నాడు.

అందుకన్నమాట యిప్పుడు ఈపిలుపు ఇతనికి కుక్కకున్నంత పసి. పాముకున్నంత కసి, నక్కకున్నంత అనుమానమూ వున్నాయని తనకు తెలుసు.

"ఏమిటేమిటి సంగతులు?" అన్నాడు హెచ్చెమ్.

"అబ్బే ఏమీలేవండీ" అని పాత సమాధానమే మళ్ళీ చెబుతూ, కృష్ణశాస్త్రి కవిత్వానికీ, వేదుల కవిత్వానికీ తేడా ఉందా, లేదా? ఉంటే ఏమిటి? లేకపోతే ఈయన ప్రసిద్ధుడెలా అయ్యాడు?" ఇదండి ఛైర్మన్‌గారు వేసిన ప్రశ్న. దానికి సమాధానం చెప్పేటప్పటికి నా తాడు తెగింది. స్కూలు టైమయిపోయింది. ఇంక అన్నం తినే టైమూ లేకపోయింది. సరాసరి ఇక్కడకు వచ్చాను. నిన్న మధ్యాహ్నం ఇంటర్వల్‌లో కుర్రాడి చేత తెప్పించుకు తిన్న టిఫిన్ తప్ప మరింకేమైనా తింటే ఒట్టు" అని తాను వున్న నిజం చెప్పేశాడు

ప్రపంచంలో కల్లా పెద్ద అబద్ధం, రాకూడని నోటి నుంచి వస్తుంటే, తనప్పుడే వింటున్నట్లు, హెచ్చెమ్ పరమాసహ్యంతో చూశాడు.

"ఈ మధ్య మీ వర్కేం శాటిస్‌ఫ్యాక్టరీగా వుండటం లేదు. ఇలాగేనా ఉద్యోగం చెయడం? పిల్లల జీవితాలతో చెలగాటాలాడాలను కుంటున్నారా? మాస్టరు గిరీ అంటే మజాకా అనుకుంటున్నారా? ఏమిటి మీ ఉద్దేశం? ఇలా అయితే నే సహించేది లేదు" అంటూ ఎగాదిగా పదిసార్లు చూశాడు. అటూ,యిటూ అరడజనుసార్లు ఊగాడు. ఎర్ర చీమలు కుడుతున్నట్లు ఎగిరాడు.

ఆయన జబ్బు సంగతి తనకు తెలుసు కానీ, పాపం మరీ యింత ముంచుకొస్తుందింతలో అనుకోలేదు. శాంతం కోల్పోకుండా "విషయం అర్థం కావటం లేదండి. నా తప్పు చెపితే...." అన్న తన వాక్యం పూర్తిచెయ్య నివ్వకుండానే,

"డోంటాక్ రబ్బిష్. నీకే బలముందనుకుంటున్నావేమో, చాలా మందిని చూశానిలాంటి వాళ్ళని గెటెవే" అని అరిచాడు.

తనింకేమీ మాటాడకుండా లేచి వచ్చేశాడు.

ఎలా ఈయనతో వేగటం?

ఎలా వేగాలో తేలే లోపలే.... కామేశ్వరరావుగారి ఆలోచనలు ఆగిపోయాయి.

కారణం డాబా కార్మిక సుందరీ, ఆమె పనులందుకొనే చిన్న మేస్త్రీను.

కామేశ్వరరావుగారొప్పుకోకపోగానీ ఆయన స్తమానమూ డాబాకట్టడం చూస్తూ ఉండటానికి కారణం కేవలం గృహ నిర్మాణ నైపుణ్య దిదృక్షకాదు. ఈ జంట విలాసమే. అయితే, ఆ ఒప్పుకోకపోవటానికి

కారణం ఆయనకుకూడా తెలియకపోవటమే కాని, ఆయన చిత్తశుద్ధిలో లోపం కాదు.

చిన్నమేస్త్రీ చిన్నదానివంక చూసేవాడు.

అదేనాడూ 'ఇటిక లందియ్యి' అనటానికి చూసిన చూపులా కామేశ్వరరావుగారికి కనపడేది కాదు.

చిన్నది అయిదు నిమిషాలకో ఇటిక చొప్పునందిస్తో వుండేది.

అతనేఇటికనీ తను పట్టుకున్నవెంటనే వదిలిన జ్ఞాపకం కామేశ్వరరావుగారికి



రావటం లేదు. అసలాయన కర్థంకాని విషయం ఇటికకూ, చిన్న మేస్త్రి చేతికీ మధ్య చిన్నదాని చేతి తాలూకు వేళ్ళు ప్రతిసారీ అంతసేపెందుకు ఇరుక్కుపోవాలన్నదే

వాళ్ళెప్పుడూ మాటాడుకుంటూనే వుండేవారు మాట ఒక్కటీ వినపడేది కాదుగానీ, మాటల మధ్య గలగలా కురిసే నవ్వులు మాత్రం వడగండ్ల వానలా కామేశ్వరరావుగారిని కలవర పరిచేవి.

ఆ మనిషెప్పుడూ నున్నగా దువ్వి కొచ్చేది. ఇడల్లి సామాన్యంగా చిన్న సిగ చుట్టుకొనేది. పుణ్యస్త్రీ పువ్వులు పెట్టుకోకుండా ఉండకూడదన్న సంగతి ఆవిడ సంస్కారంలో వున్నట్లు. ఎప్పుడూ ఆ సిగపువ్వులు లేకుండా కనిపించేదికాదు.

చిన్న మేస్త్రీకి జానెడెడంలో కూర్చుని ఇటికలందించడాన్ని ఈవిడొక్కతే స్పెషలైజ్ చేసినట్లు అది తప్ప మరో పని చేస్తుండగా రావుగారు చూడలేదు.

వాళ్ళెక్కువసేపు గువ్వల్లా గుసగుసలాడుతూ వుండేవారు. డాబా కట్టటంలో కూడా అంత రహస్యంగా మాట్లాడుకోవలసిన సంగతులున్నంటాయి కాబోలు.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి చిన్నమేస్త్రి పూటలో మొగటి మూడు గంటలూ యిలా పూలరంగడిలా గడిపినవాడు. చివరి గంటలో మొత్తం నాలుగ్గంటల్లో కట్టవలసిన గోడ కట్టేసేవాడు. "అస్తమానూ యితనిలా కట్టేస్తే ఎల్లుండి మనమేం చెయ్యాలి ?" అని మిగతా కూలీలు ఆందోళనపడుతున్నట్లా సమయంలో కామేశ్వరరావు గారిక్కనిపించేవాళ్ళు

ప్లీడరుగారువచ్చి నిల్చున్నప్పుడు పెద్ద మేస్త్రీకూడా తపీ పట్టుకొనేవాడు. బోసి నోరు. బోడిబుర్రమీద హతశేషుల్లా అక్కడక్కడ వాలిఉన్న నాలుగు తెల్ల వెంట్రుకలు. అస్తమానూ జారిపోయే కళ్ళజోడు - అతన్లాంటి వాళ్లుండగా జనం కార్టూన్లెందుకు చూస్తారో కామేశ్వరరావుగారి కర్థమయ్యేదికాదు.

పాపం మానవుడు ముచ్చటపడి "ఏదే పిల్లా ఇటిలా ఇయ్యి" అనేవాడు చిన్నదాన్ని.

ఆ పిల్ల "నీ బతుక్కి దొకటే తక్కువైంది" అన్నట్లొక చూపతని మొహం మీద పారేసి. చిన్న మేస్త్రీవైపు తిరిగిపోయేది.

"థే ఇలాథే" అని ఛెళ్ళు మన్నట్లు అరిచేవాడు చిన్న మేస్త్రీ. అపుడు చిన్న మేస్త్రీ గోడకట్టటం చూస్తే. అస్తమానూ పెద్ద మేస్త్రీ ఇలా పనిచేస్తే ఎంత బావుండును. అని ప్లీడరుగా రనుకుంటున్నారనిపించేది.

రమ్మని పిలవకుండానే. పెద్ద మేస్త్రీ చిన్న మేస్త్రీగా వున్నప్పట్నించీ అతని కిటిక అందిస్తూ వస్తున్న పైడమ్మ. జబ్బలు లొటలొట లాడుతుండగా వచ్చి. ఇటుక అందించేది.

పెద్ద మేస్త్రీ కూడా చిన్న మేస్త్రి అన్న మాటలే 'థే యిలా థే' అని అందుకుంటూ నోటో వున్న చుట్ట ఆమ్స్నె వదెట్టి, నమిలి, ఉమ్మేసి. రెండు మూడి టికలతికించినట్లుగానే అతికించి గుర్రున లేచి. జర్రున జారుకొనేవాడు. పైడమ్మ ముక్కు చీదుకుంటూ. పళ్ళెక తీసుకొని నేరేవనికి వెళ్ళేది.

ఏమాట కామాట చెప్పుకోవాలి. పెద్ద మేస్త్రీ వస్తున్నాడంటే. చిన్న మేస్త్రీ. చిన్నదీ. మరో జానెడు ఎడంగా జరిగి మాటలూ, మాటలకంటె నవ్వులూ ఒక్క పిసరు తగ్గించి, భయభక్తులభినయించేవారు.

ఎంతైనా పెద్ద మేస్త్రీ అయ్యె.

ఏమైనా సీటుకు గౌరవ మివ్వాలికదా.

పెద్ద మేస్త్రీ కూడా తక్కువవాడేం కాదు గొప్ప లౌక్యుడు. ఎప్పుడు రంగస్థలం మీదకు ప్రవేశించినా, ఈ జంటకు యెదురుగానే వచ్చేవాడు. సాధ్యమైనంత సకిలిస్తూనూ, అవసరమైనంతగా మాత్రం దూరాన్నుంచే మిగతా కూలీల నదిలిస్తూనూ వచ్చేవాడు. తన గౌరవం కాపాడుకోవటం తెలిసిన వాడాయె. లేకపోతే, ఇంత పెద్ద మేస్త్రీ ఎలాఅయ్యాడు.?

పొరపాటున కూడా వీళ్ళకు వెనక నుంచి వచ్చేవాడు కాడు.

ఈ వేళ కామేశ్వరరావుగారికి రోజు బాగోనట్లే, పెద్ద మేస్త్రీకి కూడా బాగున్నట్లు లేదు.

ఈ వేళ ఆ పొరపాటు చేశాడు. ఏదో కడుపులో పెట్టుకు వచ్చిన వాడిలా వెనక నుంచి వచ్చాడు.

అమీతుమీ తేల్చుకోదల్చుకున్న వాడిలా చడీ చప్పుడు చేయకుండా వచ్చేడు.

మన దేశంలో పనివాళ్ళకు కూడా భక్తెక్కువ.

పిల్లలను లాలిస్తే పెద్దవాళ్ళు సంతోషిస్తారని తెలుసు. చిన్న మేస్త్రీ. చిన్నదీ విష్ణుభక్తులు కాబోలు. కనుకనే, విష్ణుమూర్తి కొడుకుని రహస్య మంత్రాలతో పొగుడుతూ, నవ్వుల పువ్వులతో పూజిస్తూ. లాలిస్తూ, ఆవాహనం చేస్తున్నారు

"ఏంరోయ్? ఇది తాపీ పనా. సాని మేళమా?" పెద్ద మేస్త్రీ చలి పిడుగులా ఉరిమాడు.


చిన్న మేస్త్రీ మోచేత్తో చిన్నదాన్ని పక్కకు గెంటి తమాయించుకొని తాపీ గోడకు పాముతున్నాడు

చిన్నది చిన్నబుచ్చుకొంది పాపం.

బిత్తరపోయిందేమో చితడి కళ్ళల్లో చోటుచేసుకొంది.

ఓరకంట చూసికూడా. 'అనువుగాని వేళ అధికుల మనరాదు. కాసేపువాగి మూల లాడు వాడేపోతాడు', అనుకొన్నాడో. ఏమో. తల పైకెత్తకుండా. వేసిన అడునే వేసి. తీసిన అడుసే తీసి. తాపీపని చేసూనే ఉన్నాడు చిన్నమేస్త్రీ

పెద్దమేస్త్రీ మళ్ళీ ముదలకిస్తూ "ఏంరోయ్, ఈ యవ్వారం? మరీ బోగం



మేజువాణీ ఐపోతే ఎలా? అయ్యాడమ్మా సిగ్గొయ్యా మేమూ యిటికలు మోయించు కొన్నాం. అబ్బో నలభై ఏళ్ళు మోయించు కొన్నాం. కానీ, మరీ యింత ఈ దిబాగోతా లెరగం. ఎంత లంజ ఏషాలైతే మాత్రం సంజ పొద్దూకులూ ఒకటే యిక యికలా?" అన్నాడు.

చిన్నది మరీ ఖిన్నురాలై పోయింది. నిత్య మందహాస సుందర వదనారవిందం అమావాస్యాకాశంలా అయిపోయింది.

అంతే.

చిన్న మేస్త్రీ సర్రున లేచాడు. గుడ్లురిమి చూశాడు పెద్ద మేస్త్రీ వంక. అతని మెలికలు తీరిన కండలమీదా, కణతల మీదా నరాలు నాగుపాము పిల్లల్లా నాట్యమాడుతున్నాయి. ఆగ్రగుడ్లే గుళ్ళయి, కళ్ళే పిస్తోళ్ళయి పెద్ద మేస్త్రీని పేల్చేస్తాయనిపిస్తోంది.

"అంతవాకా వచ్చి అడుగు వెనక్కు వేస్తానా?" అనుకొన్నాడేమో పెద్ద మేస్త్రీ పైడమ్మ వంక ఒక్కసారి చూసి "ఏంటోయ్? ఆ చూపేంటి? తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు జడవ్వు. పొండి, నా పన్లోకి రావక్కరలేదు మీరు. ఎదవ సన్నాసులూ, ఎదవ్వేషాలూనూ...." ఇంకా ఏమిటో అనబోతున్నాడు.

చిన్న మేస్త్రీ పులిపంజాలాంటి కుడి చెయ్యి పైకెత్తాడు. చేతి చివర తాపీ తళతళలాడుతోంది. తాపీకింద చెయ్యి చేవ ముక్కలా నిగనిగలాడుతోంది.

పెద్దమేస్త్రీ పుచ్చె నేలమీద పడిపోయిందనుకున్నారు కామేశ్వరరావుగారు.


తాపీ ఛర్రున చప్పుడు చేసుకుంటూ పిడిదాకా నేలలో దిగిపోయింది.

చిన్న మేస్త్రి పళ్ళు పటపటలాడాయి. చూపుడువేలు పిస్తోల్లా గురిపెట్టి జాడిస్తూ "జాగ్రత్త. నీ మోచేతికింద నీళ్ళు తాగుతున్న చాతకాని ముండెవడూ లేడిక్కడ. బతకడం చేతకాని పనికిమాలిన యెదవను కాను. ఇన్నాళ్ళు నీకింద పనిచేశాను. నీకు లేకపోయినా నా కిశ్వాసం వుంది. కనక గానీ. లేకపోతేనా?.... ఛీ.... నడవే పోదాం" అని పిల్లదాని జబ్బ పట్టుకున్నాడు.

ఆమె జబ్బ విరిగిపోతున్నట్లు గిలగిల్లాడింది.

కానీ ఆ కళ్ళు, అవేమి కళ్ళు? ఆడదాని కళ్ళు మొగాణ్ణి చూస్తే అలా మెరుస్తాయా? ఆ మెరుపు ఆ జన్మలో అదే చూడ్డం కామేశ్వరరావు. ఆయన ముగ్గురు బిడ్డల తండ్రి

చిన్నదీ. చిన్న మేస్త్రీ అలాగే నాలుగడుగులు వేశారు.




పెద్ద మేస్త్రీ బింకం ఏమైపోతోందబ్బా జావగారిపోతున్నాడు. ఇంతటి పనివాడూ పోయి ఎగస్‌పార్టీలో కలిసిపోతే తన మేస్త్రాంగం ఏమైపోవాల? ఎగస్ పార్టీలో కలవకపోతే మాత్రం, ఇంతటి వాడింకోడు దొరికేదెలా? అసలీడే మేస్త్రయిపోతే?

"ఏంటోయ్ బెదిరింపులూ? ఇంతకి నేనేమన్నాననీ? ప్లీడరుగారొచ్చే ఏలయింది. చుట్టూ పెద్ద మనుషులున్నారు, ఎదురుగుండా అయగారున్నారు, మరి మన పరువు మనం నిలబెట్టుకోవాలి" ఇంతేనా? ఇంకేమన్నా అన్నానా? ఎల్లుండి మీరే అన్నమాటేటీ, నేనూ పోతానూ" అని వెనక్కి తిరిగాడు.

చిన్న మేస్త్రీ నిల్చున్నాడు. చిన్నదాన్ని తనవైపు తిప్పుకొని మరీ జబ్బ విడిచి పెట్టాడు దాని కళ్ళల్లోకి చూస్తూ.

దాని కళ్ళల్లో మెరుపు బుగ్గలమీదికి జారింది. బుగ్గలమీది తళుకు కళ్ళల్లో కెక్కింది. అక్కడా యిక్కడా యిముడలేని మిలమిల నోట్లోంచి బయటికి వద్దామా, మానామా అని ఊగుతోంది.

కామేశ్వరరావుగారు కళ్ళు మూసుకొన్నారు.

అంత కత్తిలేని పౌరుషాన్ని కూడా ఆయనంతకుముందు చూళ్ళేదు.

మనిషంటే పురుషుడా?

పురుషుడిలో ఉండవలసింది పౌరుషమా?

అది ఇలా ఉంటుందా?

మనిషి చదువుకునేకొద్దీ మనిషిలోని ఉత్తమ గుణాలు పెరుగుతాయంటారే. తానింత చదువుకున్నాడుకదా. ఈ చిన్న మేస్త్రీ ఇరవై జన్మలెత్తిసంపాదించలేనికీర్తి ప్రతిష్ఠలుగడించాడుగదా. ఈ చిన్న మేస్త్రీ ఈ పెద్ద మేస్త్రీ. తనను తనంతటి విద్యావంతుణ్ణి. ఏ ఒక్క తప్పూ తెలిసికాని తెలియక కాని చేయని వాణ్ణి పట్టుకొని హెచ్చెమ్ అలా అవమానించిన దాంట్లో వెయ్యో వంతుకూడా అవమానించలేదు కదా. అయినా, ఇతని కింత పౌరుషం పట్టపగ్గాలు లేకుండా పరవళ్ళు త్రొక్కింది కదా. తన పౌరుషాన్ని తాను వెయ్యో వంతు కూడా చూపించలేకపోయాడెందు చేత? తను హెచ్చెమ్ మోచేతి క్రింది నీళ్ళు తాగుతున్న చేతకాని వాడా? తాను బ్రతకటం చేతకాని పనికిమాలినవాడా?


పదవులు పెరిగేకొలదీ, సుఖాలు మరిగేకొలదీ, పరువు పల్చబడిపోతుందా?

తన పౌరుషం ఏమైపోయింది?

పారిపోయిందా?

ఆరిపోయిందా?

కామేశ్వరరావుగారికి ఆలోచనలు తెగటంలేదు.



సంక్రాంతి ముగ్గు

— డి. ఇందిర, జగిత్యాల